పోవడం జరిగిపోయింది.

★ ★ ★

యూనియన్ నాయకత్వంమంటే చుట్టూ కావలిసినంత కిక్కు. కనిపించని గ్లామర్.

పందిని నందిని చెయ్యాలి. పాలని నీళ్లు చెయ్యాలి. అటువంటి ట్రిక్కులు చెయ్యగలవాడే యూనియన్ నాయకుడిగా ఎదగ్గలడు.

ఎలాగైతేనేం పోలీసుస్టేషన్లో పనులు మా వాళ్లకి అనుకూలంగా చక్కబెట్టి స్కూటర్ స్టార్ చేశాను. అసలుదొంగలు మా యూనియన్ వాళ్లే. కానీ వాళ్లే దొంగలంటే ఉద్యోగాలు ఊడతాయి.

మా యూనియన్ పరువు పోవడమేకాక వాళ్లని దొంగలుగా అప్పగిస్తే నా నాయకత్వం నట్టేట్లో కలుస్తుంది. యుక్తిగా వాళ్లను తప్పించగలిగితేనే నాకు నా యూనియన్ కార్మికులు నా ఎదుట కుక్కల్లా తోక ఊపుకుంటూ పడి ఉంటారు.

రేపు నేను డివిజినల్ నాయకుణ్ణి!

ఎల్లుండి రీజియన్ నాయకుణ్ణి!

మేనేజ్‌మెంటు నేనంటే హడలెత్తుతుంది!

పరపతీ, పలుకుబడీ, హైలెవెల్లో గౌరవం!

"ప్రతాప్‌గారూ! మీది బుర్రకాదండి బాబో" అన్నాడు హెడ్‌కానిస్టేబుల్.

"అవును హెచ్‌సీగారూ! మరి మావాళ్ళు ఫ్యాక్టరీ స్టోర్ రూం కప్పులు బద్దలు కొట్టి దొంగతనం చేసారే అనుకోండి. అదే అలాగే వొప్పుకుంటే ఇక నేను యూనియన్ లీడరయ్యే కంటే మా ఊర్లో గేదెలు కాసుకోవడం నయం"

పోలీసు స్టేషన్ నవ్వుల బాంబుల్తో ఊగిపోయింది కాస్సేపు.

"అందుకే దొంగతనం చేసి చోరీ సొత్తుతో పారిపోతుంటే మా వాళ్లు తమ ప్రాణాలను లెక్క చేయకుండా దొంగల్ని వెంబడించి ఫాక్టరీ సొత్తును కాపాడితే, మేనేజ్‌మెంటు సెక్యూరిటీని తన వైపునకు తిప్పుకుని, పాతకక్షలతో వీళ్లమీద చోరీ కేసు నెత్తిన రుద్దుతుందా?" అన్నాను నేను కేసుని మలుపు తిప్పిన ధోరణిని వ్యంగ్యంగా విడమర్చుతూ.

యూనియన్ నాయకునిగా నాకు రాబోయే గుర్తింపుకి ఉబ్బితబ్బిబ్బయి యిల్లు చేరాను. ఇంటిగేటు దగ్గర స్కూటర్ పార్క్ చేశాను. హీరోలా లోపలికొచ్చాను.

మా అమ్మాయి ప్రజ్వల స్కూల్ బేగ్ అక్కడే ఉంది. నాన్నా అంటూ నన్ను అంటిపెట్టుకునే నా కూతురు అలికిడి యింట్లో లేదు.

"అమ్మాయేది" అడిగాను.

"అలా ఎక్కడికో వెళ్లుంటాది ఆడుకోడానికి"

నాకు అలసటగా ఉంది. చెమట షర్టు తీసేసి గదిలో కెళ్ళబోతూంటే కుక్క అదోలా మొరుగుతోంది. దాని ఎములను విరగదన్నాలన్నంత కోపం.

అటు చూశాను. అది నూతి గట్టు మీదికి ఎగురుతూ మొరుగుతోంది ఆందోళనగా.

అదెందుకలా చేస్తుందో తెలీలేదు.

నూతి దగ్గరకెళ్ళి లోపలికి చూశాను.

గుండె జల్లుమంది.

నీటిలో మా అమ్మాయి తల కిందికీ పైకీ కొట్టుకుంటోంది.

నేను భయంతో మా ఆవిణ్ని కేకేస్తూ, గబుక్కున నూతిలో దూకాను.

అబ్బ- నా కూతుర్ని మొత్తం మీద బతికించుకున్నాను. అయితే బతికించింది నేనా? లేక నేను నా వాకిట్లోంచి తరిమేశే కుక్కా?

డిపార్ట్‌మెంటులో పనిచేస్తున్నాను. అది యిచ్చే వేలాది రూపాయలు జీతంగా తీసుకుంటున్నాను. డిపార్ట్‌మెంట్ వర్కర్స్‌గా తిరిగి ఆ యింట్లోనే కన్నం వేసిన ఆ దొంగల్ని నిర్దోషులుగా బయటకు తెచ్చిన బాధ్యతాయుతమైన ఓ రికగ్నైజ్డ్ యూనియన్‌కి నాయకుణ్ణి.

తిన్న యింటికే కన్నం వేసిన కుసంస్కారం!- ఛీ ఛీ-

నా ఎదురుగా నేను అసహ్యించుకునే కుక్క-

అది నా కళ్లల్లోకి చూస్తోంది. ఇప్పుడు నాకు దాని ముఖం చూడడానికి సిగ్గేస్తోంది.

**-జి.నరసింహమూర్తి (మలికిపురం)**

# తృప్తి

"ఈ రోడ్డంతా కొట్టిన పిండే ఎక్కడ గోతులున్నాయో, ఎక్కడ మలుపులున్నాయో తనిట్టే చెప్పేయగలడు. ట్రాఫిక్ సిగ్నల్స్‌తో పనే లేదు. అయితే..కళ్ల మీదకు నిద్ర ముంచుకొస్తోంది. ఈ పరిస్థితుల్లో..వాహనం అదుపు తప్పితే.."

డ్రైవింగ్ సీట్లో కూర్చున్న మునిరాజు ఆలోచనలో పడ్డాడు. ఆర్టీసీ డ్రైవరుగా అతనికి మంచి పేరుంది. వాహనాన్ని వేగంగా నడవటమేకాదు ప్రమాద రహితంగా ప్రయాణికుల్ని గమ్యానికి చేరుస్తాడన్న ప్రశంసలు అందుకున్నాడు ఎన్నోసార్లు.

"నేను ఈ ఉద్యోగంలో సంపాదించిందేమీ లేదు. అల్మరాలో కనిపిస్తున్న ఈ షీల్డులు తప్ప" -గర్వంగా, సంతృప్తిగా చెప్పుకుంటుంటాడు మునిరాజు. తనింటికి వచ్చే అతిథులకు వాటి పూర్వాపరాలు వివరిస్తుంటాడు. అల్మరాలో వరుసగా పేర్చి ఉన్న ఆ షీల్డుల్ని కృతజ్ఞతా పూర్వకంగా చూసుకున్నాకే-మునిరాజు ప్రతిరోజూ విధులకు హాజరవుతాడు. అవి అతనిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచటమే కాదు, బాధ్యతను గుర్తు చేస్తుంటాయి.

ముందు రోజు రాత్రి నైట్ డ్యూటీ చేసి ఇంటికెళ్లాడు. పండక్కి కూతురు, అల్లుడు, పిల్లలతో వచ్చారు. పగలంతా వాళ్లతో సరదాగా గడిచిపోయింది. ఒక్క క్షణం కంటిమీద కునుకులేదు. మళ్లీ ఈరోజు నైట్ డ్యూటీ..స్టాఫ్ ఎక్కువ మంది సెలవులో ఉన్నారు. తనడిగితే సూపరింటెండెంట్ నుంచి అదే సమాధానం వస్తుంది. అడిగి లేదనిపించుకోవటం దేనికని మళ్లీ డ్యూటీకొచ్చాడు.

చాలా ఇబ్బందిగా ఉంది. ముందుస్టాప్‌లో చన్నీళ్లతో మొహం కడుక్కున్నాడు. టీ కూడా తాగాడు. పండగ పిండి వంటలు బాగా లాగించటం వల్లనేమో కడుపు బరువు ఎక్కింది. కళ్లు కూడా మూత పడుతున్నాయ్!

"ఏయ్!" అన్న అరుపుతో ఆలోచనల్లోంచి బయటపడిన మునిరాజు-ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యాడు. ఎదురుగా వేగంగా వస్తున్న లారీ. రెప్పపాటులో బస్సును పక్కకు తిప్పాడు. ప్రమాదం తప్పింది.

'తనవే కాదు బస్సులో ఉన్న 50 మంది ప్రాణాలకు తను జవాబుదారి'- ఆ విషయం తనకు తెలుసు. తనను హెచ్చరించిన ముందుసీట్లో అతను అంటున్నాడు కోపంగా.

"కొంచెం ఉంటే అందరూ చచ్చుండేం వాళ్లం. బండి కాస్త జాగ్రత్తగా తోలు" అతని అరుపులకు గాఢనిద్రలో ఉన్న వాళ్లంతా లేచినట్టున్నారు. ఒక్కొక్కళ్లు-ఒక్కో రకమైన వ్యాఖ్యాన్యాలు చేయటం ప్రారంభించారు.

"నైట్ డ్యూటీ అనగానే ముందు నిద్రపోయి..మనసంతా ప్రశాంతంగా పెట్టుకుని రావాలన్న స్పృహ ఉండదండీ. పగలంతా పేకాటలు, తిరుగుళ్లు"

"మందుకొట్టి కూడా కొందరు డ్రైవింగ్ చేస్తుంటారట. మొన్నామధ్య మా బామ్మర్ది చెబుతున్నాడు.."

"ఎప్పుడెప్పుడు ఇంటి కెళదామా అన్న ఆత్రుత తప్ప..ప్రయాణికుల క్షేమం గురించి వీళ్లకు పట్టదండీ"

అవన్నీ మునిరాజు చెవుల్లో పడుతున్నాయ్! పేకాట, తాగుడు వంటి వ్యసనాలు తనకి లేవని ఎలా చెప్పగలడు.

స్టీరింగ్ మీద నుంచి చెయ్యి జారిపోతోంది.

కళ్లు వా..లి..పో..తు..న్నా..య్!

"మునిరాజు లే!" ఎవరో పిలుపుతో కళ్లు తెరిచాడు. ఎదురుగా ఆఫీసు వాళ్లు. సూపరింటెండెంట్ చెబుతున్నాడు-

"ఆరోగ్యం బాలేకపోతే సెలవుపెట్టచ్చు కదా! అనవసరంగా ఇబ్బంది పడ్డావ్! ఈసారీ ఉత్తమ డ్రైవర్ అవార్డు నీకే ప్రకటించారయ్యా!" అవేమీ వినబడటం లేదు.

"ఇంతకీ బస్సు ఏమైనట్టూ?"

మునిరాజు సందేహాన్ని తీర్చటానికి అన్నట్టు..సూపరింటెండెంటు చెప్పుకు పోయాడు. "ప్రయాణీకులందరినీ క్షేమంగా చేర్చారు. నువ్వు స్టీరింగ్ మీద తలవాల్చటం చూసి..నీ పక్క సీటతను..బస్సును కంట్రోల్ చేసి..రోడ్డు పక్కన ఆపాడు. ఆ తర్వాత డిపోనుంచి వేరే డ్రైవర్‌ను పంపి.."

హమ్మయ్య! తృప్తిగా నిట్టూర్చాడు మునిరాజు. ఆరోజు తనకి ఉత్తమ డ్రైవర్ బహుమతి ప్రకటించినందు కంటే ప్రయాణీకులు క్షేమం అన్న వార్తే ఎక్కువ సంతృప్తినిచ్చింది.

**-శ్రీసాయిపల్లవి (అనంతపురం)**